హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 84

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.140	220	240
సూర్యాపేట	రూ.130	192	221
నల్లగొండ	రూ.132	190	220

ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0 । కనిష్ఠం 16.0



యాదగిరిగుట్ట ఆలయ వైకుంఠ ద్వారం వద్ద భారీ ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్సీ నిరుద్యోగులు(ఫైల్)

మెగా ఆశలు

మెగా డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 2017 తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలన్నీ భర్తీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రస్తుతమున్న ఖాళీలతోపాటు ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తే మరిన్ని ఖాళీలు ఏర్పడనుండడంతో ఇక తమ కష్టాలు తీరినట్టేనని నిరుద్యోగులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 634 పోస్టులు ఖాళీగా ఉండడంతో, ఇవన్నీ భర్తీ చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఖాళీల్లో అత్యధికంగా స్కూల్ అసిస్టెంట్ పోస్టులు 277, సెకండరీ గ్రేడ్ టీచర్లు 137 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇదిలా ఉంటే ఇప్పటికే జిల్లాలో తాత్కాలికంగా మూసివేసిన 66 పాఠశాలలను తెరిచేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

\- భువనగిరి టౌన్, భువనగిరి అర్బన్

- ఉపాధ్యాయ ఖాళీల భర్తీపై ప్రభుత్వం కసరత్తు
- ఖాళీల వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో 634 పోస్టులు ఖాళీ
- ఆనందంలో ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు

విద్యాశాఖలో ఖాళీల భర్తీ, పదోన్నతులు చేపట్టాలన్న సీఎం ఆదేశాలతో ఆశాఖ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఎనిమిదేళ్లుగా నిరీక్షించిన నిరుద్యోగులకు మెగా డీఎస్సీ ఊపిరి పోసినట్లయింది. డీఎస్సీతోపాటు పదోన్నతుల ప్రక్రియ కూడా ఏకకాలంలో ప్రకటిస్తే ఈ ఖాళీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ దశలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలకు తగినట్లు మూతబడిన పాఠశాలలు కూడా తెరుచుకునేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల వైపు జిల్లా విద్యాశాఖ చొరవ చూపుతోంది. పదోన్నతులు చేపడితే ఎన్ని ఖాళీలు ఏర్పడతాయి...? ఎంత మందికి పదోన్నతులు ఇవ్వాలి..? అనే అంశాలపై మరింత స్పష్టత వస్తుంది.

పుస్తకాలతో కుస్తీ

ఉపాధ్యాయ కొలువులే లక్ష్యంగా డీఎడ్, బీఎడ్‌లో శిక్షణ పొందిన వేల మంది యువకులు ఉద్యోగం సాధించేందుకు పట్టుదలతో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఇందుకోసం సొంతూళ్లను వదిలి వివిధ ప్రాంతాల్లో శిక్షనా కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. ఈ సంవత్సరం డీఎస్సీ నిర్వహిస్తే ఎంతో మందికి ప్రయోజనం చేకూరుతుంది.

ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు...

పాఠశాల	పోస్టులు	భర్తీ	ఖాళీలు
జీహెచ్ఎం-2	163	78	85
ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం	105	36	69
ఎస్ఏ	1469	1192	277
ఎస్జీటీ	1381	1244	137
భాషా పండితులు	210	190	20
పీఈటి	84	82	2
మ్యూజిక్ టీచర్	3	0	3
డ్రాయింగ్ టీచర్	14	1	13
క్రాఫ్ట్ ఇన్స్ట్రక్టర్	26	2	24
ఒకేషనల్ ఇన్స్ట్రక్టర్	10	6	4
మొత్తం	3465	2831	634

ఖాళీలు ఇలా

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 481, ప్రాథమికోన్నత 68, ఉన్నత పాఠశాలలు 163 ఉండగా అందులో 20,306 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ సంఖ్యకనుగుణంగా 3,465 పోస్టులు మంజూరు కాగా 2,831 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధుల్లో కొనసాగుతుండగా, 634 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్నేళ్లుగా ఉన్న ఉపాధ్యాయులతోనే విద్యాశాఖ నెట్టుకొచ్చింది. కొత్త నియామకాలు జరిగి మూతబడిన పాఠశాలలు అందుబాటులోకి వస్తే చదువులు గాడిన పడినట్లేనని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఏడేళ్లుగా నిరీక్షణ

2015 సంవత్సరం నుంచి పదోన్నతులకోసం ఉపాధ్యాయులు ఎదురుచూస్తుండగా, ఈ కొలువులకోసం నిరుద్యోగులు నిరీక్షిస్తున్నారు. 2017నుంచి టెట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు పోస్టుల భర్తీపై ఆశలు పెంచుకున్నారు. గత ప్రభుత్వం డీఎస్సీ నిర్వహణపై చేతులెత్తేయగా, కొత్త ప్రభుత్వం పదోన్నతులు, ఖాళీలు భర్తీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చాలామంది నిరుద్యోగులు శిక్షణా కేంద్రాల్లో చేరారు. ఆరు నెలల క్రితం తమకు ఉద్యోగాలు ఇవ్వాలని 2008 డీఎస్సీ అభ్యర్థులు యాదగిరిగుట్టలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

పాఠశాలలు-విద్యార్థులు ఇలా..

యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ప్రభుత్వ	273	41,146
గురుకుల, ఆశ్రమ పాఠశాలలు	31	17,393
ప్రైవేట్, ఎయిడెడ్	182	56,027
మదర్సా	1	155
మొత్తం	948	1,14,721

జిల్లాలో 66 తాత్కాలికంగా మూసివేత

జిల్లాలో 948 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య ఆశ్రమ, గురుకుల, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. అయితే విద్యార్థులు లేని కారణంగా (జీరో అడ్మిషన్లు) 66 ప్రభుత్వ పాఠశాలలను తాత్కాలికంగా మూసివేయగా, అదే కారణాలతో 13 ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలను యాజమాన్యాలు నిలిపివేశాయి. మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. పాఠశాలలను తెరిస్తే పిల్లలను చేర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తల్లిదండ్రులు అంటున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి కూడా పాఠశాల లేని ఊరు ఉండకూడదని చెప్పడంతో ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. అయితే విద్యా శాఖ లెక్కల ప్రకారం ప్రతీ 19 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉంటాడు. ఈ మేరకు కనీస సంఖ్యకు తక్కువగా విద్యార్థులు ఉన్నప్పటికీ పాఠశాలలను నడిపించేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యాశాఖ అధికారులంటున్నారు. ఆ పాఠశాలలను రద్దు చేయలేదని, విద్యార్థుల ప్రవేశాలు లేని కారణంగానే తాత్కాలికంగా మూసివేశామని, ఆ పాఠశాలల ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేశామంటున్నారు. బడి బాటలోనూ మూసివేసిన పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని స్పష్టం చేస్తున్నారు.

తాత్కాలిక మూసివేత మాత్రమే



విద్యార్థుల ప్రవేశాలు లేకపోవడంతోనే జిల్లాలో ని 66 ప్రభుత్వ పాఠశాలలను తాత్కాలికంగా మూ సివేశాం. మూసివేసిన పాఠశాలల్లో ఐదుగురు విద్యార్థులు చేరినా తిరిగి ప్రారంభిస్తాం. మూసివేసిన పాఠశాలల ఉపాధ్యాయులను సమీప ప్రభుత్వ పాఠశాల్లోకి సర్దుబాటు చేశాం. ప్రభుత్వ పాఠశాలల శాశ్వత మూసివేత ఉండదు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయుల కొరత తీరనుంది.

\- కె.నారాయణరెడ్డి, డీఈవో

ఏడేళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నాం



ఏడేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నాం. డీఎస్సీ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించగానే కోచింగ్ కేంద్రాల్లో వేలల్లో ఫీజులు చెల్లించాం. ఆర్థికంగా నష్టపోయాం గానీ, ఉద్యోగాలు సాధించింది మాత్రం లేదు. గత ప్రభుత్వంలా కాకుండా కొత్త ప్రభుత్వం వాగ్దానం ప్రకారం పకడ్బందీగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ నియామకాలు చేయాలి.

\- పైళ్ల వెంకట్‌రెడ్డి, నిరుద్యోగి, వలిగొండ

ఆపరేషన్ స్మైల్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

కలెక్టర్ హనుమంతు కే. జెండగే



ఆపరేషన్ స్మైల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భువనగిరి అర్బన్, జనవరి 3: బాలల పరిరక్షణకోసం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్ స్మైల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 31వ తేదీ వరకు అన్ని శాఖల సమన్వయంతో కృషి చేసి తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులు, భిక్షాటన చేసే బాలల అక్రమ రవాణా, నిరాదరణకు గురైన బాలలను గుర్తిం చి వారి పునరావాసానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఒక నెలపాటు జరిగే ఆపరేషన్ స్మైల్ నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ వహించి బాలల పరిరక్షణకు పాటుపడాలన్నారు. ఇందుకోసం భువనగి రి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్ డివిజన్లుగా మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో బృందంలో పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్, నలుగురు కానిస్టేబుళ్లు, ఒక కార్మిక, బాలల పరిరక్షణ, చైల్డ్‌లైన్ అధికారులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బృందాలు రంగంలోకి దిగుతాయన్నారు. బాలలు వివక్షకు గురవుతున్న, సమస్యలున్న ప్రాంతాలను గుర్తించి, వారి పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బాలల చట్టాలపై అవగాహన కల్పించేందుకు కార్మికశాఖ, బాలల పరిరక్షణ విభాగా లు క్షేత్రస్థాయిలో పని చేయాలన్నారు. గుర్తించిన బాలలకోసం ఆలస్యం చేయకుండా పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా పిల్లలను పాఠశాలల్లో చేర్పించి చదువు చెప్పించాలన్నారు. వలస కార్మికుల పిల్లలకు విద్యనందించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ బండారు జయశ్రీ, భువనగిరి ఏసీపీ ఎస్ వెంకట్‌రెడ్డి, మహిళా, శిశు సంక్షేమ అధికారి జి.అన్నపూర్ణ, బాల రక్ష భవన్ కో ఆర్డినేటర్ చందనేశ్వరి, బాలల పరిరక్షణ అధికారి సైదులు, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ దశరథ, కార్మిక శాఖ అసిస్టెంట్ అధికారి మొయినొద్దిన్, విద్యాశాఖ ఏఎంవో శ్రీనివాస్, వైద్యశాఖ ప్రోగ్రాం అధికారి మధుసూదన్‌రెడ్డి, ఎన్జీవో శివలింగం, సభ్యులు శివరాజ్, మల్లేష్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: అనాథ, తప్పిపోయిన పిల్లలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిదని సికింద్రాబాద్ రూరల్ రైల్వే డీఎస్పీ నర్సింహారెడ్డి అన్నారు. ఆపరేషన్ స్మైల్‌పై బుధవారం భువనగిరి రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రైళ్ల ద్వారా పిల్లల అక్రమ రవాణా నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ బండారు జయశ్రీ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి పి.సైదులు పాల్గొన్నారు.

'ప్రజా పాలన'ను సద్వినియోగం చేసుకోవాలి : కలెక్టర్

మోత్కూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలనను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అన్నారు. బుధవారం సాయంత్రం మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని ఏడో వార్డు పద్మశాలికాలనీలో నిర్వహిస్తున్న ప్రజాపాలన కౌంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలు ఇచ్చిన దరఖాస్తు ఫాంలను జాగ్రత్తగా భద్రపర్చాలని ఆదేశించారు. ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ దరఖాస్తుకు రశీదు ఇవ్వాలన్నారు. దరఖాస్తుదారులకు ఏవైనా సందేహాలుంటే వాటిని నివృత్తి చేయాలి తప్ప విసుక్కోకూడదన్నారు. ఇప్పటి వరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. కొన్ని దరఖాస్తులను పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్, మేనేజరు ప్రభాకర్ ఆయన వెంట ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వీసీ గోపాల్‌రెడ్డి



పోటీలను ప్రారంభిస్తున్న ఎంజీయూ వీసీ గోపాల్ రెడ్డి

చౌటుప్పల్ టౌన్, జనవరి 3: చదువుతోపాటు క్రీడల్లోనూ ఆసక్తి పెంపొందించుకోవాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల విద్యార్థుల(పురుషుల)కు చౌటుప్పల్ మునిసిపాలిటీలోని ముస్కు మధుసూదన్‌రెడ్డి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ సంస్థ ఆవరణలో ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించే క్రికెట్ పోటీలను బుధవారం గోపాల్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. క్రికెట్ ప్రపంచ క్రీడ అని, ఈ ఆటలో క్రీడాకారులు నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం పెంపొందుతాయని, క్రీడలపై అభిలాషను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అల్వాల్ రవి, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఉపేందర్, ఎంఎంఆర్ కాలేజీ సలహాదారు సత్యనారాయణరాజు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంజయ్ కుమార్ సాహు పాల్గొన్నారు. కాగా, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలలనుంచి 14 క్రికెట్ జట్లు న మోదు చేసుకోగా, మొదట ఎంజీ కాలేజీ వర్సెస్ చౌటుప్పల్‌లోని మాతృశ్రీ డిగ్రీ కళాశాలలజట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. ఈమ్యాచ్‌ను వీసీ బ్యాటింగ్‌చేసి ప్రారంభించారు.

'ప్రజాపాలన' దరఖాస్తులు 42,148

భువనగిరి అర్బన్, జనవరి 3: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో బుధవారం 42,148 దరఖాస్తులు వచ్చాయి. ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తుల కోసం జిల్లావ్యాప్తంగా 65 గ్రామసభలు నిర్వహించి, ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు విడతలుగా కొనసాగింది. దరఖాస్తులు పూర్తి చేసేందుకు హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేశారు.

ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 'ప్రజాపాలన' దరఖాస్తులు ఇలా..

తేదీ	యాదాద్రి	సూర్యాపేట	నల్లగొండ	మొత్తం
డిసెంబరు 28	11,132	8,809	23,593	43,534
29	20,475	35,109	37,750	93,334
30	35,474	56,874	69,747	1,62,095
31	సెలవు	-	-	-
జనవరి 1	సెలవు	-	-	-
2	39,033	70,953	82,272	1,92,258
3	42,148	58,271	73,724	1,74,143
మొత్తం	1,48,262	2,30,016	2,87,886	6,65,364

నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా హరిచందన



నల్లగొండ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నల్లగొండ జిల్లా నూతన కలెక్టర్‌గా దాసరి హరిచందనను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌ను ఆరోగ్యశాఖ డైరెక్టర్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. కర్ణన్ బదిలీ అయిన తర్వాత హేమంత్ కేశవ్‌పాటిల్‌కు ఇన్‌చార్జి కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు. 2010 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన దాసరి హరిచందన జీహెచ్ఎంసీలో వెస్ట్ జోనల్ సీఎస్ఆర్(కార్పొరేట్ సామాజిక బాధ్యత) అదనపు కమిషనర్‌గా, ఆయూష్ డైరెక్టర్‌గా, నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో కూడా కొంతకాలంపాటు ఉన్నతాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం మునిసిపల్‌శాఖ డీఎంగా, ప్రజావాణి స్పెషల్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న హరిచందనను రాష్ట్ర ప్రభుత్వం నల్లగొండ జిల్లా కలెక్టర్‌గా నియమించింది.

చిరు వ్యాపారులకు అండగా..

- మహిళల ఆర్థిక పరిపుష్టికి చర్యలు
- ఇటీవలి ఎన్నికలతో కాస్త ఆలస్యం
- లక్ష్యం చేరుకుంటామంటున్న అధికారులు



భువనగిరి అర్బన్, జనవరి 3: మహిళామణుల ఆర్థిక పరిపుష్టికి ఏటా బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలు అందిస్తున్నారు. రుణాలు పొందిన సంఘాల సభ్యులు చిరు వ్యాపారాలతో కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ఈ లక్ష్యం సాధనలో అధికార యంత్రాగం కీలకంగా పనిచేస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరం జిల్లాకు రూ.51,186.74 కోట్ల రుణం లక్ష్యం నిర్ధారించగా, ఇప్పటివరకు 80.19శాతం రుణాలు అందించి లక్ష్యానికి దగ్గరయ్యారు. ఈ ఆర్థిక సంవత్సరం (మార్చి 31) ముగిసే సరికి వంద శాతం రుణ లక్ష్యం చేరేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ వ్యాపారాలు చేసుకునేందుకు సంఘాలను ప్రోత్సహిస్తోంది. ఇంకా 10.81శాతం అందించి రుణ లక్ష్యం చేరుకోవాల్సి ఉండగా అందుకు మరో మూడు నెలల సమయం ఉంది.

జిల్లాలో 1.55 లక్షల సభ్యులు

జిల్లాలో 14,842 స్వయం సహాయక సంఘాలుండగా 1,55,786 మంది సభ్యులున్నారు. కాగా ఒకటి జిల్లా సమాఖ్య, 12 మండల సమాఖ్యలు, 562 గ్రామీణ సంఘాలున్నాయి. ఏదైన వ్యాపారం చేసుకునేందుకు సంఘాల అర్హతను బట్టి రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు బ్యాంకు లింకేజీల ద్వారా ముందుకు వచ్చే సంఘాలకు రుణాలు అందిస్తారు. ప్రతీ నెల సభ్యులు రుణాల(ఏడాదికి) కిస్తీ చెల్లింపులు సక్రమంగా చేస్తే మరోమారు కూడా ఇస్తారు.

రుణ లక్ష్యం చేరుకునేందుకు..

ఇప్పటివరకు రుణ లక్ష్యం చేరుకునేందుకు అసెంబ్లీ ఎన్నికలు రాగా, రుణాల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ప్రజాపాలన, ఆ తర్వాత లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలు కూడా రుణాలకు అడ్డు కాకూడదని మహిళలు కోరుతున్నారు. కాగా 2023 అక్టోబరు 9 నుంచి డిసెంబరు 5 వరకు ఎన్నికల కోడ్ ఉన్నందున యంత్రాంగం బిజీబిజీగా ఉండటంతో కొంత మేర రుణ లక్ష్య సాధనలో వెనుకబడ్డారు. ఈసారి ఎన్నికల ప్రకటన వచ్చేలోగా లక్ష్యం చేరుకోవాలన్న యోచనలో బ్యాంకులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆర్థిక ప్రోత్సాహం



ప్రభుత్వం అందిస్తోన్న బ్యాంకు రుణాలతో ఆర్థిక ప్రోత్సాహం అందుతోంది. పాల కేంద్రం, వస్త్ర దుకాణాలు నడుపుతున్నా. దీంతో కుటుంబ పోషణకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. వాయిదాలు కూడా సక్రమంగా చెల్లించడంతో తిరిగి రుణం అందుతోంది. ప్రభుత్వం ద్వారా అందుతోన్న ఈ రుణాలతో ఆర్థికంగా ఎదుగుతున్నాం.

\- చింతకింది రమాదేవి, కొలనుపాక, ఆలేరు

రుణ లక్ష్యం చేరేందుకు కృషి



మహిళలకు లింకేజీ రుణాలు అందించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే 80.19శాతం రుణాలు అందించాం. ఇంకా మిగతా 10.81 శాతం లక్ష్యం చేరేందుకు కృషి చేస్తున్నాం. ఈ ఆర్థిక సంవత్సరం మరో మూడు నెలలే ఉండగా, లక్ష్యం సాధించి తీరుతాం. ప్రతీ మండలంలో లక్ష్య సాధనకు సిబ్బందిని ఆదేశించాం. పొందిన వాయిదాలు సక్రమంగా చెల్లించి ఆర్థికంగా మహిళలు ఎదగాలి.

\- టి. నాగిరెడ్డి, డీఆర్డీవో, యాదాద్రి

సంవత్సరం	సంఘాల లక్ష్యం	రుణం పొందిన సంఘాలు	రుణ లక్ష్యం రూ.కోట్లలో	పొందిన రుణాలు రూ.కోట్లలో	రుణ శాతం
2016-17	11,380	7,322	22,122.46	19,608.09	88.63
2017-18	11,331	7,280	25,823.65	27,331.27	105.03
2018-19	11,080	7,059	24,555.83	27,550.09	112.19
2019-20	11,993	6,719	27,521.60	25,518.29	92.72
2020-21	10,595	13,450	32,896.53	31,955.08	97.17
2021-22	13,071	9,715	38,661.48	43,795.92	113.28
2022-23	12,747	8,875	58,615.97	43,069.68	73.48
2023-24	10,693	5,351	51,786.74	41,047.16	80.19

నాణ్యతా ప్రమాణాలకు ఐఎస్ఐ మార్క్

- బీఐఎస్ రాష్ట్ర సీనియర్ డైరెక్టర్ కేవీ రావు



సమావేశంలో మాట్లాడుతున్న బీఐఎస్ రాష్ట్ర సీనియర్ డైరెక్టర్ కేవీ రావు

భువనగిరి రూరల్, జనవరి 3: వివిధ వస్తువుల నాణ్యతా ప్రమాణాలు తనిఖీ చేయడానికి ఐఎస్ఐ మార్క్ దోహదపడుతుందని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్) రాష్ట్ర సీనియర్ డైరెక్టర్ కేవీ రావు అన్నారు. బుధవారం భువనగిరి మండలంలోని అనంతారం బీసీ గురుకుల స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఐఎస్ఐ మార్క్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువుల నాణ్యతకు ఐఎస్ఐ, బంగారం స్వచ్ఛతకు హాల్‌మార్క్, వ్యవసాయ వస్తువుల నాణ్యతకు అగ్రిమార్క్, ఎలక్ట్రానిక్ వస్తువుల నాణ్యతకు ఎస్.మార్క్ మన నిత్య జీవితంలో ఉపయోగపడతాయన్నారు. బీఐఎస్ జాయింట్ డైరెక్టర్ రాకేష్ తన్నీర్, స్టాండర్డ్ ప్రమోషన్ ఆఫీసర్ అబి సాయి మాట్లాడుతూ ఐఎస్ఐ మార్క్‌లేని వస్తువులు మార్కెట్‌లో కనిపిస్తే బీఐఎస్ కేర్ ద్వారా సమాచారం అందిస్తే సంబంధిత కంపెనీలు, యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయంపై విద్యార్థులకు అవగాహన కల్పించి, అనంతరం వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు నగదు పారితోషికం, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.వెంకటేశ్వర్‌రెడ్డి, డీడబ్ల్యూవో రజిత, అధ్యాపకులు మహేష్, వహిద్, దశరథ, శ్రీను, ఝాన్సీ, శ్రీవాణి, శ్రీలత, కృష్ణ, బాలు, ఖదీర్, కిరణ్ పాల్గొన్నారు.

7న ఉమ్మడి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, జనవరి 3: ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి సాఫ్ట్ అండర్- 19 ఏళ్ల బాల్ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అండర్- 19 ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఇందిర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి జిల్లాలకు చెందిన క్రీడాకారులు టెన్త్ మెమో, బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు పీడీ కె.నర్సిరెడ్డి నెంబర్ 9440072854 సంప్రదించాలని కోరారు.

ఆర్టీఏ కార్యాలయం ఎప్పుడో?

● దేవరకొండలో ఆర్టీఏ కార్యాలయం లేక వాహనదారుల ఇబ్బందులు ● నూతనంగా ప్రకటించనున్న జాబితాలో దేవరకొండ ఉండేనా?



దేవరకొండ, జనవరి 3: నల్లగొండ జిల్లా దేవరకొండలో ఆర్టీఏ కార్యాలయం లేకపోవడంతో వాహనదారులు, వాహనాల యాజమానులు, డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. దేవరకొండ డివిజన్ కేంద్రం ఏర్పాటు అయినప్పటికీ రోడ్డు రవాణాశాఖ ఆర్టీఏ కార్యాలయం లేకపోవడంతో డ్రైవింగ్ లైసెన్స్‌లకు, నూతన వాహనాదారుల నెంబర్లకు, లైసెన్స్ రెన్యువల్‌కు మిర్యాలగూడ, నల్లగొండ పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆర్టీఏ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారని వాహనాల యాజమానులు, డ్రైవర్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న వాహనాల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన సత్వర సేవలు అందించడానికి నూతన రవాణాశాఖ కార్యాలయాల ఏర్పాటుకు ఆ శాఖ ప్రతిప్రాదనలు సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. కొత్త వాహనాల రిజిస్ట్రేషన్లు, లైసెన్స్‌ల మంజూరు, యజమానుల హక్కుల మార్పిడి తదితర సేవలను ఆర్టీఏ అందిస్తుంది. నూతనంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు కావడంతో తెలంగాణ వ్యాప్తంగా 20 నుంచి 30 వరకు నూతనంగా ఆర్టీఏ కార్యాలయాల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తుంది. దేవరకొండకు నూతన ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటైతే కొన్నేళ్ల నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని వాహనదారులు, డ్రైవర్లు అభిప్రాయ పడుతున్నారు. రవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయం దేవరకొండలో లేకపోవడంతో 60 కిలోమీటర్ల దూరం ఉన్న నల్లగొండ, 80 కిలోమీటర్ల దూరం ఉన్న మిర్యాలగూడేనికి వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. పని మానుకొని రోజంతా అక్కడే ఉండాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. దేవరకొండ డివిజన్‌లో వేలాదిగా వాహనాలు ఉన్నాయి. లారీ అసోసియేషన్ కార్యాలయం కూడా ఉంది. దీనితో పాటు దేవరకొండ, కొండమల్లేపల్లిలో ట్రాక్టర్, ద్విచక్ర వాహనాల షోరూం లు ఉన్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దేవరకొండలో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కారించాలని వాహన యాజమానులు, లారీ డ్రైవర్లు కోరుతున్నారు.

లైసెన్స్ కోసం మిర్యాలగూడెం, నల్లగొండకు వెళ్లాల్సి వస్తుంది

డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రెనువల్ చేసుకోవాలంటే మిర్యాలగూడెం, నల్లగొండకు వెళ్లవలసి వస్తుంది. దీంతో రోజంతా సమయం వృథా అవుతుంది. దేవరకొండలో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

లైసెన్స్ కోసం మిర్యాలగూడెం, నల్లగొండకు వెళ్లాల్సి వస్తుంది

డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు రెనువల్ చేసుకోవాలంటే మిర్యాలగూడెం, నల్లగొండకు వెళ్లవలసి వస్తుంది. దీం తో రోజంతా సమయం వృథా అవుతుంది. దేవరకొండ లో ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేస్తే సమస్య పరి ష్కారం అవుతుంది. అధికారులు పట్టించుకోవడం లేదు.

- సమడం తిరుమల్‌రావు, లారీ డ్రైవర్, దేవరకొండ

ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలి



దేవరకొండలో రోడ్డురవాణాశాఖ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలి. రవాణాశాఖ కార్యాలయం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాము. ప్రభుత్వం స్పందించి వెంటనే ఆర్టీఏ కార్యాలయం ఏర్పాటు చేయాలి.

- గాజుల రాజేష్, వాహన యాజమాని దేవరకొండ

రవాణా కార్యాలయం ఏర్పాటుకు కృషి



దేవరకొండలో త్వరలో రవాణా కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తా. ఈ విషయాన్ని సీఎంతో పాటు రవాణాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తా, రవాణాశాఖ కార్యాలయం ఏర్పాటు అయ్యేలా చర్యలు చెపడుతా.

- నేనావత్ బాలునాయక్, దేవరకొండ ఎమ్మెల్యే.

బైక్ తీసుకెళ్లిన ఫైనాన్స్ వ్యాపారులు

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



లావూరి మంజ(ఫైల్)

తుర్కపల్లి, జనవరి 3: వాయిదాలు చెల్లించలేదని ఫైనాన్స్ వ్యాపారులు తన బైక్‌ను బలవంతంగా తీసుకెళ్లారని మనస్తాపం చెందిన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మోతీరాంతండా గ్రామపంచాయతీ పరిధిలోని గోగులగుట్టతండాలో బుధవారం జరిగింది. ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లావూరి మంజ(50) తనకున్న అర ఎకరం పొలంలో వ్యవసాయం చేసుకుంటూ, కూలి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అప్పు చేసి తన వ్యవసాయ బావి వద్ద రెండు మూడు బోర్లు వేశాడు. రెండు సంవత్సరాల క్రితం భువనగిరిలోని ఓ ఫైనాన్స్ సంస్థలో రూ.20వేలు అప్పు తీసుకొని ద్విచక్ర వాహనం(టీవీఎస్ ఎక్సల్) కొనుగోలు చేశాడు.

బైక్‌పై గ్రామాల్లో తిరుగుతూ ఉల్లిగడ్డలు, చేపలు, పండ్లు విక్రయించేవాడు. బైక్ వాయిదాలు చెల్లించక పోవడంతో ఐదు రోజుల క్రితం ఫైనాన్స్ వ్యాపారులు ద్విచక్ర వాహనాన్ని బలవంతంగా లాక్కెళ్లారు. దీంతో మంజ తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి లుంగీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం మంజ మనుమరాలు ఇంటి తలుపులు తీసి చూసే సరికి దూలానికి వేలాడుతూ కన్పించాడు. మంజకు కూతురు, కుమారుడు ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తేలని సాగర్ పంచాయితీ

● 35 రోజులుగా మూతపడిన కంట్రోల్ రూం ● లిఫ్ట్ రూం నుంచే నీటి వివరాలు నమోదు చేస్తున్న తెలంగాణ ఇంజనీర్లు



అసంపూర్తిగా సూట్ గేట్లపై రోడ్డు నిర్మాణ పనులు, అసంపూర్తి క్రేన్ ట్రాక్ పనులు

నాగార్జునసాగర్, జనవరి 3: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద 35 రోజుల కిందట ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న నీటి పంచాయితీ ప్రభావం నిర్వహణ పనులపై పడింది. ప్రధాన డ్యాంపై సీఆర్‌పీఎఫ్ భద్రత కొనసాగుతుండగా, 13వ నంబరు గేటు దాటి తెలంగాణ అధికారులను, సిబ్బందిని అటు వైపునకు వెళ్లనివ్వడం లేదు. దీంతో ప్రధాన డ్యాంపై పూర్తి చేయాల్సిన నిర్వహణ పనులు అసంపూర్తిగా నిలిచాయి.

పంచాయితీ మొదలైంది ఇలా..

గత ఏడాది నవంబరులో తెల్లవారితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో 29వ తేదీన అర్ధరాత్రి ఏపీ పోలీసులు, నీటి పారుదల శాఖ అధికారులు ప్రధాన డ్యాంపైన ఉన్న ఎస్పీఎఫ్ సిబ్బందిపై దాడి చేసి, సీసీ కెమెరాలను ధ్వంసం చేయడంతో పాటు రక్షణ గేట్లను విరగ్గొట్టి ప్రధాన డ్యాంపైకి చేరుకున్నారు. అంతటితో ఆగకుండా ప్రాజెక్టుకు మొత్తం 26గేట్లు ఉండగా అందులో 13వ నంబరు గేటు నుంచి ఆంధ్రప్రదేశ్‌కి చెందుతాయని, అలాగే ఏపీ వైపున ఉన్న కుడి కాల్వ నిర్వహణ కూడా తమకే చెందుతుందని 13వ నెంబరు గేటు వద్ద కంచెను ఏర్పాటు చేసి, బారికేడ్లను పెట్టి ఆ రాష్ట్ర పోలీసులు పహారా కాశారు. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికారులు కుడి కాల్వకు బలవంతంగా నీటిని విడుదల చేసుకున్నారు. దీంతో తెలంగాణ ప్రభుత్వ నీటి పారుదల శాఖ అధికారులు కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి ఫిర్యాదు చేయగా కుడి కాల్వకు నీటి విడుదల నిలిపివేయాలని కేఆర్ఎంబీ ఆంధ్రప్రదేశ్ సీఎస్‌ను ఆదేశించింది. అయినప్పటికీ ఏపీ ప్రభుత్వం నీటి విడుదలను నిలిపివేయలేదు. తెలంగాణలో నవంబరు 30వ తేదీన ఎన్నికలు పూర్తవగానే ఎడమ వైపున డ్యాంపై పోలీసులు మోహరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర జలశక్తి శాఖ రంగంలోకి దిగి ఇరురాష్ట్రాల సీఎస్‌లు, ఈఎన్‌సీ అధికారులు, డీజీపీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి పంచాయితీని తాత్కాలికంగా సద్దుమణిగేలా చేశారు. డ్యాంపై భద్రత కోసం సీఆర్‌పీఎఫ్ బలగాలను మోహరించారు. దీంతో గత ఏడాది డిసెంబరు 3వ తేదీన కంచెను, బారికేడ్లను తొలగించారు. నాటి నుంచి ప్రధాన డ్యాంపై ఇరువైపులా సీఆర్‌పీఎఫ్ బలగాలు పహారా కాస్తున్నాయి.

అసంపూర్తిగా రూ.5 కోట్ల పనులు

సాగర్ ప్రధాన డ్యాంపై సూట్ గేట్లు, కుడి కాల్వ గేట్లు, క్రేన్ ట్రాక్ మరమ్మతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లతో ప్రారంభించింది. పనులు జరుగుతుండగానే ఆంధ్రప్రదేశ్ పోలీసులు, నీటి పారుదల శాఖ అధికారులు ప్రధాన డ్యాంపై గొడవను సృష్టించడంతో గేట్లు బిగించడం పూర్తయినప్పటికీ, గేట్లపై తొలగించిన రోడ్డు నిర్మాణ పనులు, క్రేన్ ట్రాక్ పనులతో పాటు క్రస్ట్‌గేట్ల రోప్‌లకు గ్రీసింగ్, రబ్బరు సీల్ బిగింపు, జనరేటర్లకు మరమ్మతులు, కేబుల్ లైన్ల బిగింపు, వంటి పనులు నిలిచిపోయాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడానికి ముందే ప్రతి ఏటా క్రస్ట్ గేట్ల సర్వీసింగ్ పనులను అధికారులు డిసెంబరు నెల నుంచే ప్రారంభిస్తుంటారు. ఈ ఏడాది ఇరు రాష్ట్రాల గొడవతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

రాష్ట్ర విభజన అనంతరం ప్రాజెక్టు నిర్వహణ ఇలా

2014లో రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను విభజన కమిటీ నిర్ణయించింది. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణను ఆంధ్రప్రదేశ్ చూసుకోవాలని, సాగర్ ప్రాజెక్టు నిర్వహణను తెలంగాణ ప్రభుత్వం చూసుకుంటుందని తెలిపింది. దీంతో తొమ్మిదేళ్లుగా ప్రాజెక్టుల నిర్వహణ అలాగే కొనసాగుతున్నా, గత ఏడాది నవంబరు 29వ తేదీన ఏపీ ప్రభుత్వం వివాదం సృష్టించింది.

35 రోజులుగా మూతపడిన కంట్రోల్ రూం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య సాగర్ ప్రధాన డ్యాంపై వివాదంతో 35 రోజులుగా కంట్రోల్ రూం మూతపడింది. 13వ నంబరు గేటు దాటి తెలంగాణ అధికారులను ఏపీ సీఆర్‌పీఎఫ్ బలగాలు రానివ్వడం లేదు. దీంతో 26వ గేటుకు అవతల ఉన్న కంట్రోల్ రూం 35 రోజులుగా మూతపడింది. దీంతో నీటి నిల్వల లెక్కలు తెలంగాణ అధికారులు ఎడమ వైపున ఉన్న లిఫ్ట్ రూంలో కూర్చుని నమోదు చేస్తున్నారు. అవుట్ ఫ్లో, ఇన్ ఫ్లో వివరాలు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి నీటి విడుదల వివరాలను, కుడి, ఎడమ కాల్వల నీటి ఆవిరి, లీకేజీల నష్టాలను నమోదు చేయలేకపోతున్నామని తెలంగాణ నీటి పారుదల శాఖ అధికారులు వాపోతున్నారు.

ప్రధాన డ్యాంపై కొనసాగుతున్న సీఆర్‌పీఎఫ్ బలగాల భద్రత

సాగర్ ప్రధాన డ్యాంపై ఎడమ వైపున తెలంగాణ సీఆర్‌పీఎఫ్ బలగాలు, కుడి వైపున ఏపీ సీఆర్‌పీఎఫ్ బలగాల భద్రత కొనసాగుతోంది. కంట్రోల్ రూం వద్ద కూడా సీఆర్‌పీఎఫ్ బలగాలే పహారా కాస్తున్నాయి. ఎస్పీఎఫ్ బలగాలు కేవలం ఎడమ ఎర్త్ డ్యాం, గ్యాలరీలు, ఎడమ కాల్వ, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాల వద్ద పహారా కాస్తున్నాయి.



కుడి కాల్వ గేట్లపై అసంపూర్తిగా రోడ్డు పనులు

సమయం కోరిన తెలంగాణ ప్రభుత్వం

తెలుగు రాష్ట్రాల మధ్య నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణ, నీటి విడుదలపై కేంద్ర జలశక్తి డిసెంబరు 6వ తేదీన చర్చలకు ఇరు రాష్ట్రాల అధికారులను ఆహ్వానించింది. అయితే అప్పటికీ తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు కాకపోవడంతో అధికారులు జనవరి మొదటి వారం వరకు గడువు కావాలని కోరారు. ఆ మేరకు సమయం కేంద్రం ఇచ్చింది. అయితే బుధవారం రాష్ట్ర నీటిపారుదల ప్రిన్సిపల్ సెక్రటరీగా రాహుల్ బొజ్జ నియామకం కావడంతో త్వరలో సమావేశమయ్యే అవకాశం ఉంది. అనంతరం సమస్యకు పరిష్కారం లభించనుంది.

సకాలంలోనే పనులు పూర్తిచేస్తాం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణపై ఈ నెలలోనే చర్చలు జరుగనున్నాయి. అసంపూర్తిగా వదిలేసిన పనులను చర్చల అనంతరం సకాలంలో పూర్తి చేస్తాం. వచ్చే వరదల నాటికి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూస్తాం.

● నాగేశ్వరరావు, సాగర్ ప్రాజెక్టు ఎస్ఈ.

విద్యార్థినికి అసభ్య మెసేజ్‌లు

● ప్రైవేట్ ఉపాధ్యాయుడికి దేహశుద్ధి ● పోక్సో కేసు నమోదు
● యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో ఘటన



పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న పోలీసులు, ఉపాధ్యాయుడు సంజయ్



భువనగిరి టౌన్, జనవరి 3: విద్యాబుద్ధులు నేర్పుతూ పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినికి అసభ్య మెసేజ్‌లు పంపుతూ ఇబ్బంది పెట్టాడు. దీంతో అతని చేష్టలను గమనించిన విద్యార్థిని కుటుంబ సభ్యులు పాఠశాల ఆవరణలోనే దేహశుద్ధి చేశారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు, విద్యార్థిని కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం... భువనగిరి పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నివసించే బెల్లి సంజయ్ మూడేళ్లుగా సైన్స్ ఉపాధ్యాయుడిగా పట్టణంలోని మూడు ప్రైవేట్ పాఠశాలల్లో పీరియడ్ వారీగా సబ్జెక్ట్ బోధిస్తుంటాడు. అందులో భాగంగా భువనగిరిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. పాఠ్యాంశాల్లో అనుమానాల నివృత్తికోసం విద్యార్థులు ఆ ఉపాధ్యాయుడిని పలుమార్లు ఫోన్లో సంప్రదించేవారు. ఇదే అదునుగా సంజయ్ ఓ పదో తరగతి విద్యార్థిని సెల్‌ఫోన్‌కు రెండు నెలలుగా అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో కూడా అసభ్యకర ఫొటోలు పంపుతున్నాడు. తన పోస్టులకు స్పందించకుంటే ఫెయిల్ చేయిస్తానని హెచ్చరించసాగాడు. దీంతో ఉపాధ్యాయుడి వేధింపులను తట్టుకోలేక ఆందోళనకు గురవుతున్న విద్యార్థినిని కుటుంబ సభ్యులు ఆరాతీయగా ఉపాధ్యాయుడి భాగోతం వెలుగుచూసింది. దీంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లి ఆరాతీస్తున్న క్రమంలో సంజయ్ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడు. తనకు ఏమీ తెలియదని చెప్పడంతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు అతడికి దేహశుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎస్.సుధీర్ కృష్ణ, ఎస్ఐ నాగరాజు పాఠశాలకు వెళ్లి ఆ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపెట్టగా రిమాండ్‌కు ఆదేశించింది. అయితే సంజయ్‌పై ఏడాది క్రితం మరో పాఠశాలలో ఇదే తరహా లైంగిక వేధింపుల ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తోంది. సంజయ్‌కు ఆరు నెలల క్రితం వివాహం కాగా, భార్యతో సైతం గొడవ పడడంతో పుట్టింటికి వెళ్లినట్లు సమాచారం. కాగా నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఉదంతాలకు యాజమాన్యాలు కూడా బాధ్యత వహించాలంటూ ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్, ఆల్ ఇండియా పేరెంట్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే, డీఈవో నారాయణరెడ్డి, డీసీపీ రాజేష్‌చంద్రలకు ఫిర్యాదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలు మృతి

నేరేడుచర్ల, జనవరి 3: అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలు మృతిచెందింది. ఈ ఘటన సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్న పంచాయతీ పరిధిలోని తెలగరామయ్యగూడెంలో జరిగింది. ఎస్ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సోమగాని లీలమ్మ(80) ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. ఆమె తలకు గాయమై అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉంది. లీలమ్మ కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వైన్స్‌షాపులో చోరీ

రాజాపేట, జనవరి 3: యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలం పొట్టిమర్రి చౌరస్తాలోని వైన్స్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పొట్టిమర్రి చౌరస్తా వద్ద ఉన్న వైన్స్‌ను రాత్రి 10గంటలకు మూసివేశారు. గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వైన్స్ షెట్టర్‌ను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రూ.4.21లక్షల నగదుతో పాటు 10 మద్యం బాటిళ్లు ఎత్తుకెళ్లారు. యాదగిరిగుట్ట ఏసీపీ శివరాంరెడ్డి, సీఐ సురేందర్‌రెడ్డి, సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ వైన్స్ నిర్వాహకులు మాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

5 నిమిషాలు.. 13 కిలోమీటర్లు

● డ్రోన్‌తో మందుల సరఫరాకు ట్రయల్ రన్



భువనగిరిలో నిర్వహిస్తున్న డ్రోన్ ట్రయల్ రన్

భువనగిరి టౌన్, జనవరి 3: అత్యవసర సమయాల్లో వేగంగా మందులను సరఫరా చేసే లక్ష్యంతో ఓ ఔత్సాహిక బృందం బుధవారం భువనగిరిలో ట్రయల్ రన్ నిర్వహించింది. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్ నుంచి భువనగిరి మండలం బొల్లేపల్లి పీహెచ్‌సీకి, అక్కడి నుంచి భువనగిరికి తిరిగి భువనగిరి నుంచి ఆస్పత్రికి 25కిలోల బరువు గల మందులను డ్రోన్ ద్వారా సరఫరా చేశారు. ట్రయల్ రన్ విజయవంతం అయితే మందుల సరఫరాకు వైద్య ఆరోగ్య శాఖ, ఎయిమ్స్ ఆస్పత్రి ఒప్పందం కుదుర్చుకుంటామని బృందం తెలిపింది. ఎయిమ్స్ నుంచి భువనగిరికి అనగా 13 కి.మీ.లు డ్రోన్ ద్వారా 5 నిమిషాల వ్యవధిలో మందులను సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ట్రయల్ రన్‌ను పలువురు ఉత్సాహంగా వీక్షించారు.

ఆన్‌లైన్‌లో సైన్స్ పండుగ

● ఈ నెల 19 నుంచి 25 వరకు జిల్లాస్థాయి ఇన్‌స్పైయిర్- మానక్ ● సన్నద్ధమవుతున్న విద్యార్థులు

పెరుగుతున్న శాస్త్రవిజ్ఞానం మానవ రహిత సేవలను అందుబాటులోకి తెస్తోంది. ఇప్పటికే పలు రంగాల్లో మనుషులను పోలిన రోబోలు ప్రవేశించి వాటి పనులు అవే చేసుకుంటున్నాయి. యావత్ ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వైపునకు అడుగులు వేస్తుండగా విద్యార్థుల్లో టెక్నికల్ స్కిల్స్‌ను పెంచేందుకు విద్యాశాఖ చర్యలను ముమ్మరం చేస్తోంది. కొత్త ఆలోచనలతో సరికొత్త ఆవిష్కరణలు రూపొందించే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తోంది.

(మిర్యాలగూడ టౌన్)



రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి రాజ్య శాస్త్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శని-23 పోటీలు జనవరి రెండో వారంలో ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నారు. జవహర్ లాల్ నెహ్రూ జాతీయ వైజ్ఞానిక గణిత, పర్యావరణ ప్రదర్శన పేరుతో నిర్వహించనున్న ఈ సైన్స్‌ఫెయిర్‌లో సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ పేరుతో విద్యార్థులు పలు ప్రాజెక్టులను రూపొందించి ఆన్‌లైన్లో ప్రదర్శించే ఏర్పాట్లు చేస్తోంది.

రెండో వారంలో జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

ఈ నెల 19 నుంచి 25 వరకు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించనుంది విద్యాశాఖ. జిల్లాలోని సమస్త యాజమాన్యాల పరిధిలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలిచ్చింది. పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి అభ్యసించే విద్యార్థులు జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొంటారు. గణిత, సైన్స్ ఉపా ధ్యాయులు సమన్వయంతో పనిచేసి ప్రతి పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు రూపొందించి ఆన్‌లైన్‌లో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. ఆయా ప్రాజెక్టులను గూగుల్ ఫారమ్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 8వ తేదీలోగా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. జిల్లా స్థాయిలో ప్రదర్శించిన ప్రాజెక్టుల్లో ఉత్తమమైనవి ఎంపిక చేసి రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌కు పంపిస్తారు. సైన్స్ ఫెయిర్ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరించనుండగా కన్వీనర్‌గా డీఈవో, సభ్యులుగా డైట్ ప్రిన్సిపాల్, జిల్లా సైన్స్ అధికారి కమిటీల్లో ఉండనున్నారు. 2022-23 విద్యాసంవత్సరంలో ఇన్‌స్పైర్ మానక్ అవార్డ్సుకు జిల్లా వ్యాప్తంగా 143మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులు తాము రూపొందించిన ప్రాజె క్టులను ఇన్‌స్పైర్ మానక్ అవార్డ్స్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జనవరి 1 నుంచి 18వ తేదీ వరకు డిస్ట్రిక్ట్ లెవల్ ఎగ్జిబిషన్ ప్రాజెక్టు కాంపి టీషన్ (డీఎల్‌ఈపీసీ)లో వీడియో, తదితర వివరాలను పొందపరచాలని డీఈవో కోరారు. ఇన్‌స్పైర్ మానక్ అవార్డ్సుకు ఎంపికైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ ప్రాజెక్టుల నిర్వహణ-మూల్యాంకనం చేయించేలా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, గైడ్ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.

ప్రదర్శనలో ప్రధానాంశాలివే..



మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రాజెక్టుల రూపకల్పనలోనూ మార్పులు, చేర్పులు ఉండాలి. సమాజం కోసం సైన్స్ అండ్ టెక్నాలజీ' పేరుతో ఏర్పాటు చేయనున్న సైన్స్ ఫెయిర్‌లో పర్యావరణ జీవనశైలి(జీవితం), ఆరోగ్యం, వ్యవసాయం, సమాచారం, రవాణా, కంప్యూటేషన్ థింకింగ్ అనే ఉప అంశాలను చేర్చారు. ఈ విభాగాల్లో ప్రథమస్థానం సాధించిన ప్రదర్శనల్లో జూనియర్, సినియర్ విభాగాల నుంచి ఐదేసి ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి పంపిస్తారు. ఆయా అంశాల్లో వర్కింగ్ మోడల్స్‌కు ప్రాధాన్యం ఉంటుంది. సైన్స్ ఫెయిర్ జరిగే రోజుల్లో వివిధ అంశాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, సెమినార్లు ఉంటాయని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలి



జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నాం. జనవరి 19నుంచి 25 వరకు ఇన్‌స్పైర్-మానక్ ప్రదర్శన ఉంటుంది. ఇందులో గతేడాది ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారు. ఇక ఈ నెల రెండోవారంలో నిర్వహించనున్న రాజ్య శాస్త్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శని-23లో జిల్లాలోని సమస్త యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి అభ్యసించే విద్యార్థులు పాల్గొంటారు. నిర్దేశించిన అంశాలపై ప్రాజెక్టులు రూపొందించి పాల్గొనే విధంగా ఆయా పాఠశాలల సైన్స్, మ్యాథ్స్ ఉపాధ్యాయులు కృషిచేయాలి. అర్థవంతమైన ప్రాజెక్టులను రూపొందించే విధంగా ఆయా సబ్జెక్టు టీచర్లు విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలి.

● బొల్లారం బిక్షపతి, నల్లగొండ డీఈవో

సైన్స్ పట్ల ఆసక్తి పెంచేందుకే..



మానవ మనుగడకు సైన్స్ అవసరం ఎంతో ఉంది. అందుకే విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యాలను పెంచే దిశగా చర్యలు చేపట్టాం. సామాన్య, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులు రూపొందించే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలి. ఆన్‌లైన్లో నిర్వహించే జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు సంబంధించి విధివిధానాలు అన్ని పాఠశాలలకు పంపించాం. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఏమైనా సందేహాలు ఉంటే సెల్: 9848578845 నెంబరుకు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలి. ప్రకృతి, పర్యావరణం, సమాచారం, వ్యవసాయం, సాంకేతికత, జీవనవిధానమనే అంశాలను వివరించాలి.

● వనం లక్ష్మీపతి, జిల్లా సైన్స్ అధికారి, నల్లగొండ.

శాస్త్రోక్తంగా నిత్యవిధి కైంకర్యాలు



లక్ష్మీనృసింహుల తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి 3: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు శ్రీవైష్ణవ పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రభాతవేళ సుప్రభాతంతో కొండగుహలోని స్వయంభువులను మేల్కొలిపిన ఆచార్యులు బిందెతీర్థంతో నిత్యోత్సవాలను ఆరంభించారు. మూలమూర్తులను అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి, ప్రాకార మండపంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి సుదర్శన హోమం, నిత్యతిరుకల్యాణం నిర్వహించారు. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత సువర్ణపుష్పార్చన పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అలంకార వెండి జోడు సేవలు, సహస్రనామార్చన పూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్య పూజలు, కొండకింద వ్రత మండపంలో సత్యనారాయణస్వామి వ్రతపూజలు కొనసాగాయి. ప్రభాతవేళ గోదాదేవిని ఆరాదిస్తూ తిరుప్పావై వ్రతపూజలు వైభవంగా కొనసాగాయి. తన మనోవల్లభుడు శ్రీరంగనాథుడిని భర్తగా పొందేందుకు ఆలపించిన తిరుప్పావై పాశుర పఠనం జరిపిన అర్చకబృందం ఆండాళ్ అమ్మవారిని కొలుస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.16,47,443 ఆదాయం సమకూరినట్టు దేవస్థాన అధికారులు తెలిపారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిని సందర్శించిన భక్తులు హుండీల్లో సమర్పించిన మొక్కు కానుకలను గురువారం కొండకింద వ్రత మండపం రెండో హాల్‌లో లెక్కించనున్నట్లు దేవస్థాన ఈవో రామకృష్ణారావు ప్రకటనలో తెలిపారు.

మట్టపల్లిలో భక్తవత్సలుడికి గరుడోత్సవం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుని నిత్యాకల్యాణం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి, రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. తర్వాత ఆలయ సంప్రదాయ ప్రకారం ఆర్జిత కైంకర్యాలు జరిగాయి. ఉదయం హోమాధికాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణ మూర్తులను పరిణయోత్సవ వేదికపైకి వేంచేయించి పుణ్యాహవాచనం గావించారు. పాదప్రక్షాళనం మధుపర్క పూజలు యాథావిధిగా చేపట్టారు మాంగళ్యధారణ, యజ్ఞోపవీత ధారణలు అనంతరందివ్యమూర్తులకు గరుడోత్సవం జరిగింది. ఆలయ తిరువీధుల్లో స్తంభోద్భవుడిని ఊరేగించారు. అనంతరం దేవేరులను ఆలయ ప్రవేశం చేయించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మట్టపల్లి వాసునికి హైదరాబాద్‌కు చెందిన చెన్నూరి సాహితీ-పవన్‌కుమార్‌లు రూ.20వేల విలువ చేసే వెండి హారతి ప్లేటును ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, అర్చకుల సమక్షంలో దేవస్థానానికి అందజేశారు.



మఠంపల్లిలో వెండి హారతి ప్లేటు బహూకరిస్తున్న దాత

సార్.. మా పొట్ట కొట్టొద్దు

ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఫలితంగా తమ జీవనోపాధి పోయిందని పలువురు ఆటో డ్రైవర్లు వాపోయారు. ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా గురువారం ఆందోళనకు దిగారు. పలు చోట్ల భిక్షాటన చేసి ప్రభుత్వం తమ గోడు ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధి దూరం చేసి తమ కుటుంబాల పొట్ట కొట్టొద్దని కోరారు.

నల్లగొండ, జనవరి 3: టీఏటీయూ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లు బిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాజర్ అలీ మీర్జా, నల్లగొండ టీఏటీయూ అసెంబ్లీ కన్వీనర్ కలగొని యాదగిరిగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు ప్రదర్శన చేస్తూ పాదచారుల దగ్గర భిక్షమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో కార్మికులకు నెల రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం నాయకులు వెంకన్న, చోటు, రాము, నాయక్, వజ్రయ్య, మహేష్, రవిగౌడ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లిలో రాస్తారోకో

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో ఆటో డ్రైవర్లు రాస్తారోకో చేశారు. అమ్మనబోలు రోడ్డు నుంచి బస్టాండ్ వరకు ఆటోలతో ర్యాలీగా చేరుకున్న ఆటో డ్రైవర్లు బస్టాండ్ ఎదుట బైఠాయించారు. ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యం కారణంగా ఆటోలలో ప్రయాణించే వారి సంఖ్య తగ్గి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోలు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తమకు ఈ పరిణామం వీధినపడేలా చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నెల రోజులుగా ఈఎంఐలు కట్టలేని పరిస్థితి నెలకొందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు బింగి జానయ్య, మునుకుంట్ల గణేశ్, ఉయ్యాల శ్రవణ్, యాదయ్య, కే. సత్తయ్య, కే. పరమేశ్, కే. నర్సింహ్మారావు, డీ. లింగయ్య, బీ. రవి, ఎం. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్లు



ఆలేరులో భిక్షాటన చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఉపాధి కోల్పోతున్నాం

ఆలేరు రూరల్: యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో పీఏటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు భిక్షాటన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి సంతోష్‌గౌడ్ మాట్లాడుతూ ఆటో డ్రైవర్ల కుటుంబాన్ని అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోతున్నందున ఆటో డ్రైవర్లను ఆదుకునే విధంగా ప్రభుత్వం దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు చెక్క వెంకటేష్, తేరపు రాములు, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు కోరికొప్పుల అంజయ్య, గౌస్, చంద్రయ్య, మురళి, మల్లయ్య, విజయ్, ఉపేందర్, నర్సింహులు, భిక్షపతి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో నిత్యాన్నదాన సత్రం ఏర్పాటు

అఖిల భారత భక్త మార్కండేయ నిత్యాన్నదాన సత్రం చైర్మన్ సూర్య నారాయణ



మంత్రి కొండా సురేఖకు శుభాకాంక్షలు తెలుపుతున్న సూర్యనారాయణ

చౌటుప్పల్ టౌన్, జనవరి 3: అయోధ్య పుణ్య క్షేత్రంలో నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మించేందుకు రెండు, మూడు ప్రాంతాల్లో స్థలాలను పరిశీలించామని శ్రీశైలంలోని అఖిల భారత భక్త మార్కండేయ నిత్యాన్నదాన సత్రం చైర్మన్ వర్కాల సూర్య నారాయణ తెలిపారు. చౌటుప్పల్ పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, అయోధ్యలోని రామమందిరంలో ప్రాణ ప్రతిష్ట జరిగిన అనంతరం భక్తుల సంఖ్య లక్షల్లో ఉండే అవకాశం ఉందని, అందుకనుగుణంగా పద్మశాలీల కోసం ప్రత్యేకంగా నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయంలో వర్కాల సూర్య నారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కొండా సురేఖ కు రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించరూ..

● కాలనీవాసుల వేడుకోలు

భువనగిరి రూరల్, జనవరి 3: జనావాసాల మధ్య ట్రాన్స్‌కో అధికారులు హడావుడిగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. వర్షం సమయాల్లో ఈ ప్రాంతంలో మెరుపులు రావడంతో కాలనీ వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. భువనగిరి మండలం వీరవెల్లి బీసీ కాలనీలో 10 సంవత్సరాల క్రితం 15 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను హడావుడిగా ఏర్పాటు చేశారు. అయితే కాలనీ వాసులు అభ్యంతరం చెప్పినప్పటికీ ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగిస్తామని పేర్కొంటున్నప్పటికీ ఇప్పటి వరకు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించలేదు. ఈ విషయమై స్థానిక లైన్‌మన్‌కు కాలనీ వాసులు విజ్ఞప్తి చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన నివసిస్తున్న సోకం లక్ష్మి ఉదయం ఆరుబయట నీటిని చల్లుతుండడంతో ఆమెకు విద్యుత్ షాక్‌కు గురైన ఘటనలు కూడా ఉన్నాయి. ఆ కుటుంబంలోని చిన్నారులు ఇంటి ఆవరణలో ఆడుకునేందుకు వెళుతుండగా విద్యుత్ షాక్ వస్తోందని ఆ కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. ఈ విషయమై రూరల్ ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యుత్ ప్రమాదం పొంచి ఉందని తాము ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నామని ప్రమాదాలు జరగక ముందే ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించి, వేరే చోట ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై రూరల్ ఏఈ శ్రీనివాస్‌ను సంప్రదించగా అతను అందుబాటులోకి రాలేదు.



వీరవెల్లిలో బీసీ కాలనీలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలి



మా ఇంటి పక్కనే స్తంభానికి 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫారాన్ని ఇక్కడ ఏర్పాటు చేయొద్దని మొరపెట్టుకున్నప్పటికీ విద్యుత్ అధికారులు పట్టించుకోలేదు. ఇంటి పక్కనే స్తంభానికి ట్రాన్స్‌ఫార్మర్ బిగించి ఉండంతో వర్షం వచ్చినప్పుడు విద్యుత్ తీగలు కదులుతూ ఆ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి పెద్ద శబ్దంతో మంటలు వస్తున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించి వేరే ప్రాంతంలో అమర్చాలి.

-సోకం లక్ష్మి, గృహిణి, వీరవెల్లి, భువనగిరి మండలం

ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలిస్తాం

జనావాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తరలింపు కోసం షిఫ్టింగ్ ఎస్టిమేట్ డబ్బులు చెల్లించినట్లయితే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తరలింపునకు చర్యలు తీసుకుంటాం. ఇళ్ల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లయితే వెంటనే సంబంధిత యజమానులు అభ్యంతరం తెలిపినట్లయితే ఆ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయబోము. ఎలాంటి అభ్యంతరాలు తెలపకుంటే ఆ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం.

-వెంకటేశ్వర్లు , భువనగిరి రూరల్, ఏఈ

సావిత్రీబాయి జీవితం స్ఫూర్తిదాయకం

చౌటుప్పల్ టౌన్, జనవరి 3: భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిఫూలే జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి అన్నారు. చౌటుప్పల్ పట్టణంలోని కందాళ రంగారెడ్డి భవన్‌లో బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రి బాయి జయంతి నిర్వహిచారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు జయమ్మ ,యాదమ్మ, శారద, రేష్మ, హర్షియా, పర్హాత్ పాల్గొన్నారు. చందన స్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు.

భువనగిరి టౌన్: మహిళల ఆత్మ గౌరవానికి సావిత్రీబాయి పూలే ప్రతీక అని బీజేపి జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాంసుందర్‌రావు అన్నారు. బుధవారం భువనగిరిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నర్ల నర్సింగ్‌రావు, మహిళా మోర్చ జిల్లా అధ్యక్షురాలు సుర్వి లావణ్య, డీఎల్ఎన్‌గౌడ్, చందా మహేందర్‌గుప్త, పి ఉమాశంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే మరో కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీజేపీ నేత డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ సావిత్రిబాయిపూలేకు నివాళులర్పించి మాట్లాడారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో ఐద్వా జిల్లా కార్యదర్శి భట్టుపల్లి అనురాధ, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్, రాంద్రయ్య ఉన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమాల్లో బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి, నాయకులు కుమార్, మనోహర్, శంకర్, రాంచందర్, శ్రీకాంత్, రమేష్, యాదగిరిగౌడ్, నవీన్‌కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మోత్కూరు : మండలంలోని పలు చోట్ల నిర్వహించిన కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నోముల రమేష్, బత్తిని ప్రభాకర్, రైల్వే బోర్డు సభ్యుడు కొణతం నాగార్జునరెడ్డి, బీజేపీ నాయకులు పోచం సోమయ్య, గౌరు శ్రీనివాస్, దొంతి నర్సిహారెడ్డి, గుజ్జ సోమనర్సయ్య, ముత్తినేని తిరుమలేష్, పాటిమట్లలో ఉపాధ్యాయులు సిహెచ్.స్వప్న, కె.నాగలక్ష్మీ, రామానుజమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా విద్యార్థినులు సావిత్రిబాయిపూలే వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మమత, భాగ్యలక్ష్మి, అరుణ, గీత, పూర్ణిమ, ఉదయ, ఉష, సంధ్య పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో సావిత్రీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు

ఆలేరు రూరల్: మండలంలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాలకు విద్యను అందించిన గొప్ప సామాజిక సేవకురాలు అని కొనియాడారు. కార్యక్రమాల్లో పూల నాగయ్య, ఆర్.జనార్ధన్, బి.వెంకటేష్, శ్రీరాములు, వెంకటేష్, రమేష్, పెంటయ్య ఉన్నారు.

గుండాల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని మొరిపిరాల ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయురాలు వి.సుజాతను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. హెచ్ఎం యాస పద్మారెడ్డి, ఉపాధ్యాయులు జె.కరుణాకర్, నాగమల్లు, సత్యం పాల్గొన్నారు.

రాజపేట: మండల కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతిని నవభారత యూత్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జూకంటి ప్రవీణ్‌కుమార్, జాన్ ఉపేందర్ ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలో బహుజన ప్రజాశక్తి ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని నిర్వహించారు. బహుజన ప్రజాశక్తి రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్, మాజీ సర్పంచు నోముల గణేష్, బీపీఎస్ నాయకులు ముసునూరి యాదగిరి, భారత భూషణ్ పాల్గొన్నారు.



భువనగిరిలో సావిత్రీబాయి చిత్రటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



రాజాపేటలో సావిత్రీబాయిపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నియంతృత్వం బలపడితే ప్రజాగ్రహం తప్పదు: సీపీఎం



కరపత్రం విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్ టౌన్, జనవరి 3: పాలకుల్లో నియంతృత్వ ధోరణులు బలపడితే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు రుజువు చేశాయని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ అన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో చౌటుప్పల్ పట్టణంలో నిర్వహించే సీపీఎం జిల్లా స్థాయి శిక్షణ తరగతుల కరపత్రాలను స్థానిక కందాళ రంగారెడ్డి భవన్‌లో బుధవారం జహంగీర్ ఆధ్వర్యంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ శిక్షణ తరగతుల్లో జిల్లా వ్యాప్తంగా నెలకొన్న సమస్యలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, ఎండి.పాషా, ఎ.రామేశ్వరి, పార్టీ మునిసిపాలిటీ, మండల కార్యదర్శులు బండారు నర్సింహ, గంగదేవి సైదులు, మునిసిపల్ సీపీఎం ఫ్లోర్‌లీడర్ జి.లక్ష్మణ్ గౌడ్, నాయకులు ఎ.గోవర్ధన్, చీరిక సంజీవరెడ్డి, తడక మోహన్, బొజ్జ బాలయ్య, రాగీరు కిష్టయ్య, పల్లె మధు, శివకుమార్, బోదాసు వెంకటేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి: పారిశుధ్య కార్మికులు



నిరసన తెలుపుతున్న మునిసిపల్ పారిశుధ్య కార్మికులు

ఆలేరు రూరల్, జనవరి 3: రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా మునిసిపల్ చైర్మన్, కమిషనర్ ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొంటూ పారిశుధ్య కార్మికులు బుధవారం తెల్లవారుజామున విధులకు వెళ్లకుండా స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి నిత్యం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న తమకు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. పలు మార్లు మునిసిపల్ చైర్మన్ శంకరయ్యకు, కమిషనర్‌కు తమ ఇబ్బందులను తెలిపినా నిర్లక్ష్యం వహించడంతో విధులకు వెళ్లకుండా నిరసన తెలిపామన్నారు. తమకు వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సర్పంచ్‌ల పదవీ కాలం పొడిగించాలి



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్‌ల ఫోరం నాయులు

చౌటుప్పల్ రూరల్, జనవరి 3: కరోనాతో గ్రామాల అభివృద్ధికి కుంటుపడినందున సర్పంచ్‌ల పదవీకాలం పొడిగించి, అభివృద్ధికి సహకారించాలని సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, గత ప్రభుత్వం మంజూరు చేసిన బీటీ రోడ్లు, సీసీ రోడ్లు యథాతథంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి, మునగాల ప్రభాకర్‌రెడ్డి, గుర్రం కొండల్, కవిత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి బోగారం ఎంపీటీసీ పద్మ



ఎంపీటీసీ పద్మ దంపతులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీరేశం

రామన్నపేట, జనవరి 3: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్షితులై మండలంలోని బోగారం గ్రామానికి చెందిన ఎంపీటీసీ గోగు పద్మ సత్తయ్య బుధవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వీరేశం కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో రామన్నపేట జడ్పీటీసీ పున్న లక్ష్మి, జగన్మోహన్, దుబ్బాక ఎంపీటీసీ మదూరి జ్యోతీరామచంద్రరావు, నాయకులు జెల్ల వెంకటేష్ ఉన్నారు.

నేడు అందుబాటులోకి సదరం స్లాట్లు

భువనగిరి అర్బన్, జనవరి 3: దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహిస్తున్నట్లు డీఆర్డీవో టి.నాగిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త, రెన్యూవల్ ధ్రువపత్రాలు కోసం మీ-సేవ కేంద్రాల్లో ఈ నెల 4న ఉదయం 11గంటలకు స్లాట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఆర్థోపెడిక్‌కు సంబంధించి ఈ నెల 6, 11, 20, 27 తేదీల్లో 30 కొత్తవి, 10 రెన్యూవల్స్, కంటి లోపం 5. 23, 30తేదీల్లో కొత్తవి 15, రెన్యూవల్ 10, మానసిక రుగ్మతకు సంబంధించి 18న కొత్తవి 40, రెన్యూవల్ 10, వినికిడి లోపం 9. 23, 30 తేదీల్లో 40కొత్తవి, 10రెన్యూవల్ కోసం స్లాట్లు బుక్‌చేసుకోవాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు సదరం క్యాంపునకు దరఖాస్తులు చేసుకోకూడదని ప్రకటనలో కోరారు.

8న భువనగిరిలో అప్రెంటిస్ మేళా

భువనగిరి అర్బన్, జనవరి 3: భువనగిరి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సుజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రసిద్ధి గాంచిన కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు, తగిన ధ్రువపత్రాలతో హాజరుకావాలని కోరారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

తుర్కపల్లి, జనవరి 3: తుర్కపల్లి మండలం తిర్మాలాపూర్ గ్రామంలో పబ్బోజు చంద్రమౌళిచారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బుధవారం మిత్రులు అందరు కలిసి కుటుంబాన్ని పరామర్శించి రూ.40వేలు ఆర్థిక సహాయం తోపాటు బియ్యాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వంగ నారాయణరెడ్డి, వంగ రాజిరెడ్డి, అయినాల చైతన్యమహేందర్‌రెడ్డి ఉన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

అడ్డగూడూరు, జనవరి 3: స్థానిక పోలీస్ స్టేషన్‌లో అడిషనల్ డీసీపీ రవి కూమార్ బుధవారం పోలీస్ స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించి, దస్త్రాలను పరిశీలించారు. తదనంతరం వలిగొండ- తొర్రూరు ప్రధాన రహదారిపై చౌళ్లరామారం గిడ్డంగుల గోదాముల దగ్గర పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌కు స్థల పరిశీలన చేశారు. కార్యక్రమంలో రామన్నపేట సీఐ మోతిరాం, ఎస్ఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

12నుంచి సంక్రాంతి గ్రామీణ క్రీడోత్సవాలు

● తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి

భువనగిరి టౌన్, జనవరి 3: తెలంగాణ సంప్రదాయాలను కాపాడే లక్ష్యంతో యువజన సంఘాల ఆధ్వర్యంలో జిట్టరాధమ్మ ఫౌండేషన్ సహకారంతో ఈనెల 12, 13, 14వ తేదీల్లో భువనగిరిలో సంక్రాంతి సంబురాల్లో భాగంగా జిల్లా స్థాయి గ్రామీణ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుడు జిట్ట బాలకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12న స్వామి వివేకానంద జయంతిని నిర్వహించి క్రీడలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో క్రీడలు నిర్వహిస్తున్నట్లు విజేతలకు ట్రోఫిలతో పాటు ప్రథమ బహుమతిగా రూ.10,116, ద్వితీయ బహుమతిగా రూ.6,116, తృతీయ బహుమతిగా రూ.3,116, చతుర్థ బహుమతిగా రూ.2,116 నగదు ప్రోత్సాహకాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. క్రీడల్లో పాల్గొనే ప్రతీ జట్టుకు రూ.1000 ప్రత్యేక బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు. వ్యక్తిగత ప్రతిభ చూపే క్రీడాకారులకు రూ.1500, రూ.1000 నగదు రివార్డుగా ఇస్తామన్నారు. క్యారంబోర్డు, గిల్లిదండ, పతంగుల పోటీ, రింగ్ బాల్, చెస్, తాడు బొంగరం, మహిళలకు బెచ్చలాట, ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్, వనగండ్లు, తొక్కుడు బిల్ల, పచ్చీస్ ఆట నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ప్రతిభా పాటవ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనవరి 10 సాయంత్రం 5గంటల లోపు జిట్టా బాలకృష్ణారెడ్డి పార్లమెంట్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9866636426ను సంప్రదించాలన్నారు. సమావేశంలో యువజన సంఘాల ప్రతినిధులు బద్దం భాస్కర్‌రెడ్డి, బెల్లి చంద్రశేఖర్, సరగడ కరుణ్, హమీద్, చింతల లక్ష్మీనారాయణ, రత్నపురం శ్రీనివాస్, సోమారం శంకర్, బరిగె శంకర్, మోహన్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాలకృష్ణారెడ్డి తదితరులు

ఐఎన్‌టీయూసీని బలోపేతం చేయాలి

సంస్థాన్ నారాయణపురం, జనవరి 3: మండల కేంద్రంలో బుధవారం ఐఎన్‌టీయూసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ పుట్టపాక గ్రామ శాఖ అధ్యక్షుడిగా నడికుడి లింగయ్య, మండల ప్రధాన కార్యదర్శిగా చుక్కా శ్రీనును నియమించారు. వీరికి సంఘం మండల అధ్యక్షుడు రాచకొండ లింగస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు కరంటోతు ప్రజ్ఞానాయక్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఐఎన్టీయూసీని మరింత బలోపేతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో నారాయణపురం మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఏపూరి సతీష్ , జిల్లా ఉపాధ్యక్షుడు మందుల బాలకృష్ణ, నక్క రమేష్, నోముల మాధవరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

ఆలేరురూరల్/ తుర్కపల్లి/ యాదగిరిగుట్ట/ రాజాపేట, జనవరి 3: గ్రామాల ప్రగతే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో గ్రామాల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలేరు మండలంలోని శారాజీపేట, టంగుటూరు గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆలేరు నిర్వహించిన పెన్షనర్ దినోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మండల ప్రత్యేక అధికారి అనురాధ, డీఎల్‌పీవో యాదగిరి, ఎం పీపీ గంధమల్ల అశోక్, ఎంపీడీవో గ్యార ప్రకాశ్, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో సలీం, సర్పంచ్ బండ పద్మ, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు చింతకింది మల్లేశం, రాములు, మోహన్‌రెడ్డి, బాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశం, బాలనర్సయ్య ఉన్నారు. తుర్కపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో జడ్పీ సీఈవో సిహెచ్. కృష్ణారెడ్డి, మండల స్పెషలాఫీసర్ శ్యాంసుందర్, ఎంపీడీఓ ఉమాదేవి, తహసీల్దార్ దేశ్యా, ఎంపీటీసీలు కానుగంటి శ్రీనివాస్‌యాదవ్, ధనావతు మోహన్‌బాబు, సర్పంచ్‌లు జక్కుల శ్రీవాణివెంకటేశ్, నాంసాని సత్యనారాయణ, శాగర్ల వాణిపరమేశ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. యాదగిరిగుట్టలో నిర్వహించిన కార్యక్రమంలో గుట్ట మునిసిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, మునిసిపల్ కౌన్సిలర్లు బబ్బూరి మౌనికశ్రీధర్‌గౌడ్, రాజు, ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. రాజాపేట మండలం రేణికుంటలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ మౌనిక, ఎంపీపీ బాలమణి, జడ్పీటీసీ గోపాల్, ఉపసర్పంచ్ శేఖర్‌రెడ్డి, జడ్పీసీఈవో కృష్ణారెడ్డి, నోడల్‌అధికారి పద్మావతి పాల్గొన్నారు.

భువనగిరి రూరల్: పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ జడ్పీసీఈవో బి శ్రీనివాసరావు, ఎంపీపీ నరాల నిర్మల, జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, ఎంపీడీవో గుత్తా నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం అంజిరెడ్డి అన్నారు. మండలంలోని హన్మాపురం, బస్వాపురం, ముత్తిరెడ్డిగూడెం గ్రామాల్లో జరిగిన సభల్లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వైస్ఎంపీపీ ఏనుగు సంజీవరెడ్డి, ఎంపీవో అనురాధ దేవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి, నాయకులు ఏనుగు ధర్మారెడ్డి, గోమారి ఎల్లారెడ్డి, మచ్చ నర్సింహగౌడ్, రంగ మల్లేశ్, తుమ్మేటి వెంకటేష్, బాల్‌రాజ్, మైసయ్య పాల్గొన్నారు.

భువనగిరి టౌన్: ప్రజా పాలనలో ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందాలని మునిసిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, ఆర్డీవో అమరేందర్ అన్నారు. భువనగిరిలో నిర్వహించిన ప్రజా పాలనలో వారు మాట్లాడారు. మునిసిపల్ కమిషనర్ బి.నాగిరెడ్డి, కౌన్సిలర్లు ఎల్లమ్మ, కిరణ్‌కుమార్, స్వామి, వెంకటేష్, సబిత పాల్గొన్నారు.

చౌటుప్పల్ : రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పరిపాలన కొనసాగిస్తుందని చౌటుప్పల్ మునిసిపల్ వైస్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. మున్సిపాలిటీలోని 12, 13వార్డుల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో అధికారులు పద్మజరాణి, జగన్నాథరావు, మునిసిపల్ కమిషనర్ సోలిపురం భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు తాడూరి శిరీషపరమేష్, సుల్తాన్, రాజు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు నేగుదాల రమేష్, టి రవి ఉన్నారు.

అడ్డగూడూరు: సంక్షేమ పథకాల కోసం అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో చంద్రమౌళి కోరారు. డి.రాపాక, కంచనపల్లిలో మండల ప్రత్యేక అధికారి కృష్ణ, తహసీల్దార్ శేషగిరిరావు ఉన్నారు.

గుండాల: మండలంలోని బండకొత్తపల్లి, వస్తాకొండూరు గ్రామాల్లో దరఖాస్తులను స్వీకరించారు. బండకొత్తపల్లి గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని గతంలో దళితులకు భూ పంపిణీ చేయగా కొంత మంది వ్యక్తులు దొంగ పట్టాలు చేయించుకున్నారని ఆరోపిస్తూ తహసీల్దార్ కుమారికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కుమారి, వ్యవసాయ అధికారి లావణ్య వైస్ ఎంపీపీ మహేందర్ రెడ్డి, సర్పంచ్‌లు భిక్షమమ్మ, హేమలత, భిక్షం పాల్గొన్నారు.

మోత్కూరు : పాలడుగు గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన సదస్సులో మండల ప్రత్యేక అధికారి పి.యాదయ్య మాట్లాడారు. దరఖాస్తులు సక్రమంగా నింపి, రశీదులు పొందాలన్నారు. సర్పంచ్ మర్రిపెల్లి యాదయ్య అధ్యక్షతన జరిగిన ప్రజాపాలన సదస్సులో ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి, తహసీల్దార్ డి.రాంప్రసాద్, ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణాచారి, ఉపసర్పంచ్ ఎడ్ల భగవంతు తదితరులు పాల్గొన్నారు. మోత్కూరు మండల వ్యాప్తంగా ఐదో రోజు 1858 దరఖాస్తులు అందాయి. మండలంలోని గ్రామాల నుంచి 880 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, మునిసిపాలిటీలో 978 దరఖాస్తులు వచ్చాయని కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు.

మోటకొండూర్ : మండలంలోని చాడ, అమ్మనబోలు గ్రామాల్లో తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీవో వీరస్వామి, ఎంపీవో కిషన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్లంల సంజీవరెడ్డి, శీలా బాలకృష్ణ, నల్లమాస విశ్వనాథం, ఆకుల శ్రీనివాస్, గుర్రాల పాండు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : కూరెళ్ల, రహీంఖాన్‌పేట గ్రామాల్లో ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజారామ్, ఇన్‌చార్జి తహసీల్దార్ పార్థసింహారెడ్డి, ఎంపీడీవో నిరంజన్, సర్పంచ్ బి.ఉప్పలయ్య పాల్గొన్నారు.

చౌటుప్పల్ రూరల్ : ప్రజాపాలనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైస్ఎంపీపీ ఉప్పు భద్రయ్య కోరారు. మండల పరిధిలోని పంతంగిలో అభయహస్తం దరఖాస్తులను స్వీకరించారు. తహసీల్దార్ హరికృష్ణ, సర్పంచ్ బాతరాజు సత్యం, ఎంపీటీసీ ఇందిర ఉన్నారు.



భువనగిరిలో మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ ఆంజనేయులు



ఆలేరులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అయిలయ్య